జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు

ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీఏవో

పెద్దపల్లి, ఫిబ్రవరి8: జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి యూరియా కొరత లేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాసంగి సీజన్‌కు 37000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రణాళికలు తయారు చేసి సరఫరా కోసం అన్ని మండలాల్లో సమగ్రచర్యలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 28,293 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రాగా, 22, 720 మెట్రిక్ టన్నులు రైతులకు విక్రయించటం జరిగిందని, ప్రస్తుతం 5573 మె ట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఫిబ్రవరి మార్చ్ నెలలో మరో 11, 531 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని పేర్కొన్నారు.రైతుల అవసరాలను సకాలంలో తీర్చేందుకు మార్క్ ఫెడ్ వద్ద 2759 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

జిల్లాకు 1508 మెట్రిక్ టన్నుల యూరియా

జిల్లాకు మరో 1508 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని డీఏవో దోమ ఆది రెడ్డి తెలిపారు. శనివారం జిల్లాకు (సగం రేక్) 1508 మెట్రిక్ టన్నులు రాగా, రైల్వే స్టేషన్ నుంచి లారీల ద్వారా గోదాంలోకి తరలించామన్నారు. యూరియా కొరత లేకుండా ప్రణాళికబద్ధంగా ముందుకు పోతున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని పీఏసీఎస్ ద్వారా రైతులకు యూరియా సకాలంలో సరఫరా చేసేందుక అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందోద్దని సూచించారు. అనంతరం గోదాంలోని నిల్వ చేసిన స్టాక్‌ను పరిశీలించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు మెరుగ్గా నిర్వహించాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి8: జిల్లాలో అంగన్ వాడీ కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అంగన్ వాడి కేంద్రాల పనితీరు, అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, లబ్ధిదారుల వివరాలు, ఫ్రీ స్కూల్ నిర్వహణ, అనేమియా నివారణ వివరాలను సంక్షేమ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల దినోత్సవం దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 10న పూర్తి స్థాయిలో పిల్లలందరికీ మాత్రలు అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగు నీటి సరఫరాకు సంబంధించి ప్రస్తుత స్థితిగతులపై సంపూర్ణ నివేదికను అందించాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు

గాంధీచౌక్ ఏరియాలో రోడ్లపైనే వ్యాపార సామగ్రి పెట్టుకున్న వ్యాపారులు

రోడ్లపై ఆటోలు, అంబులెన్స్ ఉండడంతో ముందుకు వెళ్లకుండా ఉన్న స్కూల్ బస్సు

మంథని పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనాలు ఎక్కడ పడితే అక్కడి పార్కింగ్ చేయడంతో పాటు వ్యాపారులు తమ సామగ్రిని రోడ్లపై ఇష్టానుసారంగా పెడుతుండడంతో ఒకే సారి రెండు వాహనాలు వెళ్లడం కష్ట తరంగా మారుతున్నది. రెండు రోజుల క్రితం గాంధీచౌక్ నుంచి ప్రభుత్వ దవాఖానకు అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని తరలిస్తుండగా రోడ్డుపై కారు పార్కింగ్ చేసి ఉండడంతో కొన్ని క్షణాల పాటు అంబులెన్స్ ఆగిన పరిస్థితులు కన్పించాయి. గాంధీచౌక్ నుంచి ప్రభుత్వ దవాఖాన వరకు రహదారి ఇరుకుగా ఉండటంతో ఈ రహదారిపై వేరే కారు, ఇతర పెద్ద వాహనాలు పార్కు చేస్తే అంబులెన్స్, స్కూల్ బస్సులు వంటివి వెళ్లడం కష్టతరంగా మారుతుంది.

-మంథని, ఫిబ్రవరి 8

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి !

- గ్రామాల్లో ప్రశ్నించే గొంతుగా మారుతున్న యువత
- ప్రజాప్రతినిధులుగా అవకాశం దక్కేనా?
- స్థానిక పోరులో సత్తా చాటేనా ?
- అవకాశం రాకుంటే రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగే యోచన

కమాన్ పూర్, ఫిబ్రవరి 8: స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామ యువత ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే గ్రామాల్లో సమస్యలపై ప్రశ్నించే గొంతుకలుగా మారుతున్నారు. అన్ని రాజకీయ పార్టీల్లోని యువకులు రాజకీయ నాయకులుగా.. ప్రజాప్రతినిధులుగా మారాలని భావిస్తున్నట్లు తెలుస్తున్నది. మండలంలోని అన్ని గ్రామాల్లో యువకులు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి తమ సత్తా ఏమిటో చూపించాలని కుతూహలంగా ఉన్నారు. ఆయా రాజకీయ పార్టీల నుంచి "పార్టీ" అభ్యర్థిగా గుర్తింపు కోసం నిరీక్షిస్తున్నారు. నోటిఫికేషన్ వెలువడ్డాక.. తాము నమ్ముకున్న పార్టీల నుంచి ఆశించిన మేరకు తమకు గుర్తింపు లభిస్తుందా.. లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. సీనియర్ రాజకీయ నాయకులు ఎక్కువ సంఖ్యలో ఉండడం, అందులో మాజీ ప్రజా ప్రతినిధులు కూడా అధికంగా ఉండటం.. యువకులకు సీనియర్ నేతల నుంచి పోటీ ఉండడం తో.. వారి ఆశలకు ప్రతిబంధకంగా మారే అవకాశాలు లేక పోలేదు. వివిధ రాజకీయ పార్టీల పెద్దలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్లకు పెద్దపెట వేస్తారా ..? లేక యువతకు ప్రాధాన్యం కల్పిస్తారా..? అన్నది తేలాలంటే స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై.. పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా వెలువడితే కానీ తెలియని పరిస్థితి నెలకుంది. ఇది ఇలా ఉం డగా.. కొంత మంది యువకులు తమకు అవకా శం ఇవ్వని యెడల రెబల్ అభ్యర్థులుగా బరిలో ఉండే అవకాశాలు లేక పోలేదు. ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటే.. ఆయా పార్టీ అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేసే పరిస్థితి నెలకుంటుంది. అద్భుతమే జరిగితే యువ రెబల్స్ కూడ గెలిచిన ఆశ్చర్య పోవలసిన అవసరం లేదు. యువకులు పరిషత్ ఎన్నికలైన ఎంపీటీసీ, జడ్పీటీసీలకే కాకుం డా పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు యువత పోటీ చేసేందుకు సమయాత్తమవుతున్నారు. ఈ సారి జరగబో యే.. పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధాన రాజకీయ పార్టీల్లో యువత కు ఏ పార్టీ అవకాశం ఎక్కువగా కల్పిస్తుంది.. అనేది ఆసక్తిగా మారింది.

యూరియా వచ్చేసింది

- 'నమస్తే'కు స్పందన
- జూలపల్లి విండోకు యూరియా సరఫరా
- రైతులకు అందజేత

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఏవో ఆదిరెడ్డి

జూలపల్లి, ఫిబ్రవరి 8 :యూరియా కొరత తీరింది. జూలపల్లి సింగిల్ విండో పరిధిలో 'యూరియా కోసం రైతుల తిప్పలు శీర్షిక న ఈ నెల 7న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కాగా, ఉన్నతాధికారులు స్పందించారు. శుక్రవారం ఆయా సింగిల్ విండోలకు కావాల్సిన యూరియా బస్తాలను లారీల్లో పంపించగా, రైతులు సంబురపడ్డారు.

డీఏవో ఆగ్రహం.. జూలపల్లికి 55 మెట్రిక్ టన్నుల సరఫరా

జూలపల్లి సింగిల్ విండో కార్యాలయంలో యూరియా పంపిణీ తీరుపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దోమ ఆదిరెడ్డి ఆగ్రహ వ్యక్తం చేశారు. యూరియా కోసం ఐదు రోజులుగా రైతుల 'క్యూ' అనే కథనానికి స్పందించి శనివారం సింగిల్ విండోను సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులు, యూరియా పంపిణీ తీరును పరిశీలించి సీఈవో గీస సురేశ్, సిబ్బందిపై విరుచుకుపడ్డారు. సరిపడినంతా యూరియా నిల్వలున్నా రైతులు బారులు తీరేలా ఎందుకు వ్యవహరించారని మండిపడ్డారు. రైతులకు అందుబాటులో ఉండేలా పని వేళలు పాటించాలని పేర్కొన్నారు. 55 మెట్రిక్ టన్నుల యూరియాను తెప్పించి, కొరత తీర్చారు. రైతులు ఆందోళన పడవద్దని, సరిపడా యూరియా సరఫరా చేస్తామన్నారు. మండలంలో రైతులకు 2,974 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని చెప్పారు. ఇప్పటికే 1634.09 టన్నులు సరఫరా చేశామనీ, యాసంగి చివరి నాటికి మిగితా 1340.01 టన్నుల పంపిణీ చేస్తామని వెల్లడించారు.

సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యమివ్వాలి

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 8 : ప్రభుత్వ పాఠశాలల్లో నల్ల బోర్డు మీద రాసే విధానాన్ని తగ్గించి, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యమివ్వాలని సమగ్ర శిక్ష క్వాలిటీ జిల్లా కో-ఆర్డినేటర్ పీఎం షేక్ అన్నారు. శనివారం ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) ద్వారా పాఠాలు బోధించే విధానంపై పెద్దపల్లి జడ్పీహెచ్ఎస్ (బాలికల)లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు (స్కూల్ అసిస్టెంట్లు) హాజరయ్యారు. మొదటి రోజు గణితం, బయోఫిజికల్ సైన్స్, సోషల్ సబ్జెక్టు టీచర్లకు అవగాహన కల్పించారు. ఐఎఫ్‌పీ ప్యానెల్‌లో ముందుగానే లర్నింగ్ మెటీరియల్ పొందుపర్చి విద్యార్థులకు సులువుగా బోధించేలా ఉపాధ్యాయులకు విపులీకరించి నేర్పిస్తున్నారు. ఇలా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఈ నెల 11,12 తేదీల్లో జరిగే ఆయా సబ్జెక్టు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో మిగతా ఉపాధ్యాయులందరికీ ఐఎఫ్‌పీ బోధనపై అవగాహన కల్పించనున్నట్లు పీఎం షేక్ తెలిపారు. సమావేశంలో ఎంఈవో సురేందర్, హెచ్ ఎం టీ అరుణ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న క్వాలిటీ కో-ఆర్డినేటర్ పీఎం షేక్

కార్మికుల పక్షాన పోరాడేది టీబీజీకేఎస్సే

గోదావరిఖని, ఫిబ్రవరి 08: సింగరేణి కార్మికుల పక్షాన పోరాడే సంఘం టీబీజీకేఎస్సేనని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య అన్నారు. శనివారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దశాబ్ద కాలంగా నుంచి కార్మికుల కోసం రాజీలేని పోరాటం చేసి అనేక హక్కులు సాధించింది టీబీజకేఎస్‌గా పేర్కొన్నారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డిపై వ్యక్తిగత ఆరోపణలు చేసిన ఐఎన్టీయూసీ నాయకులను వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆరు డివిజన్‌ల నుంచి గెలుపొంది ఇచ్చిన భామిలు ఇంటి స్థలం, వడ్డీలేని రుణం, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినయింపు, క్యాడర్‌స్కీం, ప్రమోషన్‌లు నూతన గనుల ఏర్పాటు , సూపర్ సెష్పాలిటీ దవాఖాన నిర్మాణం లాంటి వాగ్దానాలను ఇప్పటికి వరకు సాధించలేదన్నారు. కంపెనీకి వచ్చిన లాభాలు 4,700 కోట్లలో 50శాతం వరకు అభివృద్ధి పేరిట పక్కదారి పట్టించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్టీయూసీదేనని విమర్శించారు. ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి రాంచందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు జావీద్ పాషా, చెల్పూరి సతీశ్, శ్రీనివాస్‌రావు, చెల్కలపల్లి శ్రీనివాస్, అంజయ్య, వాసర్ల జోసఫ్, గోపి, బొగ్గుల సాయి, మీసరాజు, వెంకటస్వామి, నరేశ్, ఐలయ్య, భాస్కర్, పోశం ఉన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి8 : పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో వేసవికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, పాత భవనంలో కొనసాగుతున్న ఓపీ, డయాలసిస్ యూనిట్‌ను ప్రధాన దవాఖానలోకి మార్చాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష డీసీఎహ్ఎస్ డాక్టర్ శ్రీధర్‌ను ఆదేశించారు. శనివారం ప్రభుత్వ మాతా శిశు కేంద్రాన్ని తనిఖీ చేసి వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ, సెక్యూరిటీ, పెషంట్లకు అందుతున్న వైద్యసేవల గురించి డీసీహెచ్ఎస్ శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పెద్దపల్లి దవాఖాన ఆవరణలో రూ. 57 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన కొత్త భవనానికి కావాల్సిన ఏర్పాటు సజావుగా జరుగాలని, పాత భవనాన్ని కూల్చివేసి ప్రణాళిక బద్ధంగా పనులు వేగిరం చేయాలని సూచించారు. మాతా శిశు కేంద్రంలో నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, బోంపల్లి పంప్‌హౌస్ నుంచి పెద్దపల్లి కి వచ్చే మిషన్ భగీరథ నీటి సరఫరాను పరిశీలించారు. తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని, మరమత్తులు ఏమైనా ఉంటే సరిచేసుకోవాలన్నారు. డీసీఎహ్ఎస్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ రవీందర్, డాక్టర్ మందల వాసుదేవరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ పూర్ణచందర్ రావు ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో వార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

స్థానికులకు భవన నిర్మాణ పనులు అప్పగించాలి

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 8: నూతన గృహాల నిర్మాణాల్లో స్థానిక మేస్త్రీలకే అవకాశాలు ఇవ్వాలని, దూర ప్రాంతాలకు చెందిన మేస్త్రీలకు పనులు ఇవడం మూలంగా నిర్మాణ పనులు మధ్యలోనే వదిలి వెళ్తున్నారని, దీంతో భనాలు నిర్మించుకునే ఇంటి యజమాలు డబ్బులు నష్టపోతున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మస్రత్, సదానందంలు కోరారు. శనివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దపల్లి ప్రాంత ప్రజలు నూతన గృహాలు నిర్మాణం చేపట్టే ముందు స్థానికుల కాద అనే విషయాన్ని చూసుకొవాలని అన్నారు. సొంత ఇండ్ల నిర్మాణాల కోసం ఎవకి పడితే వారికి పనులు అప్పగించడం వల్ల ఇంటి యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన చెందారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే అన్ని రకాల కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తామని వాటి ద్వారానే మేస్త్రీ, కూలీ, పేయింటర్స్, తదితరులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. మార్చి 1న కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు అందజేస్తామని తెలిపారు. ఇక్కడ నాయకులు లక్ష్మణ్, సుధాకర్, సతీశ్, సదానందం, శ్రీనివాస్, మల్లేశం ఉన్నారు.

జవాబు దారీగా పనిచేయాలి

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 8: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల పోలీసు సిబ్బంది బాధ్యతో జవాబుదారిగా పనిచేయాలని గోదావరిఖని ఏసీపీ రమేశ్ పేర్కొన్నారు. శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్టేషన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఏసీపీ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు భద్రతగా విధులు నిర్వహించాలన్నారు. డయల్ 100 సేవలు, బ్లూకోల్ట్స్, సీసీ కెమోరాల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు పాటుపడాలన్నారు. ఇక్కడ వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, సీఐ 2 రవీందర్, ఎస్ఐలు రమేశ్, భూమేశ్, సోనీ, ఓబులమ్మ, సిబ్బంది ఉన్నారు.

సైకిల్ పై గుంపులకు చేరుకున్న వృద్ధుడు

న్యాయం కోసం సైకిల్ యాత్ర

- జనగామ జిల్లా నుంచి సుప్రీం కోర్టు కు బయలు దేరిన వృద్ధుడు

ఓదెల, ఫిబ్రవరి 8: తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ వృద్ధుడు సుప్రీం కోర్టు వరకు సైకిల్ యాత్ర చేపట్టాడు. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం రఘునాథపల్లె గ్రామానికి చెందిన బొమ్మనేని చంద్రారెడ్డి న్యాయం కోసమని సుప్రీంకోర్టుకు సైకిల్ పై వెళ్లుతున్నాడు. కాగా శనివారం రాత్రి ఆయన ఓదెల మండలం గుంపుల గ్రామానికి చేరుకున్నాడు. గత సర్పంచ్ ఎన్నికల్లో తనకు అన్యాయం జరిగిందనీ, ఎవరికి చెప్పుకున్నా న్యాయం జరగకపోవడంతో సుప్రీంకోర్టుకు సైకిల్ పై వెళ్లుతున్నట్లు తెలిపాడు. సర్పంచ్ ఎన్నికలో తాను పోటీ చేయగా, కొందరు నన్ను బలవంతం చేసి విత్‌డ్రా చేయించారనీ, ఈ విషయం అధికారులకు తెలిపిన పట్టించుకోలేదని తన సైకిల్‌కు ఏర్పాటు చేసుకున్న ప్లేక్సీలలో పేర్కొన్నాడు. దీంతో తనకు న్యాయం కావాలని సుప్రీంకోర్టుకు వెళ్లుతున్నట్లు చెప్పారు. ఈ సైకిల్ యాత్ర ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో అనూష

ముత్తారం, ఫిబ్రవరి 8: మండలంలోని ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి జే అనూష శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు ఎరువులు అందించే సమయంలో రశీదు ఇవ్వాలని నాణ్యమైన ఎరువులను మాత్ర మే రైతులకు విక్రయించాలని, నిషేధిత ఎరువులను, విత్తనాలను ఎవరైనా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధర్మారం మండలంలో..

ధర్మారం,ఫిబ్రవరి8: ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఏవో ప్రమోద్ హెచ్చరించారు. శనివారం ధర్మారం, దొంగతుర్తి, రామయ్యపల్లి గ్రామాలలోని ఎరువులు, పెస్టిసైడ్ దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.దుకాణాలలో రిజిస్టర్లతో పాటు గోదాములను తనిఖీ చేసి ఎరువుల నిల్వలను ఆయన పరిశీలించారు.

వైద్యాధికారికి మోమో: డీఎంహెచ్‌వో

- 'నమస్తే' కథనానికి స్పందన

మంథని రూరల్, ఫిబ్రవరి8: 'రివ్యూ మీటింగ్‌లో రియల్ ఎస్టేట్ ప్రచారం'శీర్షికన నమస్తే తెలంగాణలో శనివారం ప్రచురితం అయిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ప్రభుత్వ రివ్యూ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రచారం పై వాట్సప్ ద్వారా మండల వైద్యాధికారి సృజన్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివరణ కోరినట్లు డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి నమస్తేతో వెల్లడించారు. ఈ వాట్సప్ సందేశానికి మరోసారి ఇలా జరుగకుండా చూసుకుంటానని సంబందిత మండల వైద్యాధికారి సృజన్ రిప్లై ఇచ్చారన్నారు. ఆ వైద్యాధికారికి మెమో కూడ జారి చేస్తున్నమని అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

వృథాగా పోతున్నమిషన్ భగీరథ నీరు

వేణుగోపాల స్వామి ఆలయం ఎదుట నిలిచిన నీరు

ఓదెల, ఫిబ్రవరి 8: కొలనూర్‌లో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం రాత్రి మిషన్ భగీరథ నీరు ట్యాంక్ పైనుంచి కింద పడడంతో నీరంతా వృథాగా పోవడమేకాక, పక్కనే ఉన్న వేణుగోపాల స్వామి ఆలయం చుట్టూ నీరు నిలిచిపోయాయి. దీంతో భక్తులు ఆలయానికి రావడానికి ఇబ్బందిగా మారడంతో పాటు నీరు నిలవడం కారణంగా ఆలయ పరిసర ప్రాంతం చెత్తా, చెదారంతో అపరిశుభ్రంగా మారింది. జీపీ సిబ్బంది నిర్లక్ష్యం వలన ఇలా తరచూ జరుగుతుందని మాజీ ఎంపీటీసీ పర్శ రమేశ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ట్యాంక్ నుంచి నీరు వృథాగా వెళ్లకుండా చూడాలని కోరారు.

అడ్రియాల గనిని సందర్శించిన న్యాయమూర్తి

న్యాయమూర్తిని సన్మానిస్తున్న ఆర్జీ-3 అధికారులు

రామగిరి, ఫిబ్రవరి 8: మంథని కోర్టు న్యాయమూర్తి ఎం.స్వాతి శనివారం సింగరేణి అడ్రియాల లాంగ్‌వాల్ గనిని సందర్శించారు. ముందుగా ప్రాజెక్టు అధికారి ఎం.నాగేశ్వరరావు న్యాయమూర్తికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు విశిష్టత, పనితీరును వివరించారు. ప్రాజెక్టును సందర్శించి అక్కడ యంత్రాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ యాదయ్య, ఎస్ఓ షబ్బీర్ తదితరులున్నారు.

ప్రజావాణి రద్దు

పెద్దపల్లి, ఫిబ్రవరి8: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం (10న) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్ మేళా

పెద్దపల్లి, ఫిబ్రవరి8: ఈనెల 10 నుంచి 25వ వరకు మున్సిపల్ కార్యాలయంలో ట్రేడ్ లైసెన్స్, ఎల్ఆర్ఎస్ మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ శనివారం తెలిపారు. కొత్త ఇంటి నంబర్లు, పేర్ల తప్పులు, పేరు మార్పిడి,ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్, నూతన ట్రేడ్ లైసెన్స్, ఎల్ఆర్ఎస్ కోసం ప్రత్యేకంగా నిర్వహించే మేళాను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి అనధికార ప్లాట్‌ను క్రమబద్ధీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 31 వరకు చివరి అవకాశం కల్పించిందని వెల్లడించారు. .

బాధ్యతల స్వీకరణ

ఓదెల, ఫిబ్రవరి 8: ఓదెల తహసీల్దార్‌గా జే సునీత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జిల్లాలో జరిగిన బదిలీల్లో కలెక్టరేట్‌లో పని చేస్తున్న సునీతను ఓదెలకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కొత్త తహసీల్దార్‌కు డీటీ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

అగ్ని ప్రమాదం

జూలపల్లి, ఫిబ్రవరి 8 ః తేలుకుంటలో శనివారం తడకపెల్లి శంకర్‌కు చెందిన పెంకుటిల్లుకు విద్యుత్ షాక్ తగిలింది. కరెంట్ తీగలు తగిలి ఇంటి పైకప్పు పాక్షికంగా కాలిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి బయటకు వచ్చారు. ఇరుగు పొరుగు స్పందించి మంటల్ని వ్యాపించకుండా చర్యలు తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

పీఆర్పీ చెల్లించాలని జీఎంకు వినతి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 8 : సింగరేణి కోల్ మైన్స్ ఆఫీసర్స్ పీఆర్పీ వెంటనే చెల్లించి తదితర సమస్యలను పరిష్కరించాలని అధికారుల సంఘం నాయకులు జీఎం బండి వెంకటయ్యను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం జీఎం కార్యాలయ ఆవరణలో జీఎంను అధికారులు కలిసి తమ సమస్యలను విన్నవించి వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో అధికారుల సంఘం నాయకులు పీ. నర్సింహులు, సుంకరి మధుసూదన్, బీ. చంద్రశేఖర్, నరేశ్, జనార్దన్, రామకృష్ణ, సుగుణాకర్, నితీన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి ఫిబ్రవరి 8 : అధికారులందరికీ వేతనంలో భాగమైన పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ 2022- 23)కు సంబంధించి కోలిండియాలో జూన్- 2024లో చెల్లించినప్పటికి సింగరేణిలో ఇప్పటివరకు చెల్లించలేదని త్వరితగతిన పీఆర్పి చెల్లింపుకు ఏర్పాట్లు చేయాలని కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎస్సీ సీఎల్ బ్రాంచి ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంకు విజ్ఞప్తి చేశారు. అలాగే శనివారం ఏపీఏ జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించి సీఎండీ బలరాంకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్. వెంకటరమణ. వైస్ ప్రెసిడెంట్. డివైఎసిసి శ్రీకాంత్, నాగేశ్వరరావు, సెక్రటరీ శ్రీనివాసరావు, సత్యనారాయణ, రమేశ్, ట్రెజరర్ స్వర్ణకుమార్. జాయింట్ ట్రెజరర్ మనోహర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పాలి

మంథని రూరల్, ఫిబ్రవరి8: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రథమంగా చదవడం, రాయడం నేర్పించాలని కాంపెక్స్ ప్రధానోపాధ్యాయులు, జిల్లా రిసోర్స్ పర్సన్స్ అన్నారు. మండలంలోని గుంజపడుగు కాంప్లెక్స్ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంగ్లీష్, తెలుగు భాషలో ఎంత వరకు ప్రావీణ్యం సాధించారనే విషయాన్ని పరిశీలించారు. విద్యార్థులను దత్తత తీసుకొని పిల్లల్లో చదవడం నేర్పిస్తున్నారా..?లేదా అని పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమం లో ఎంఈఓ లక